

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | శుక్రవారం | నవంబర్ 24, 2023 | www.navatelangana.com



ఖేల్ ఇండియాలో జిల్లా క్రీడాకారుల సత్తా

- జూడో లీగ్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారిణులు
- ఆదిలాబాద్ క్రీడాపాఠశాల విద్యార్థుల ప్రతిభ

8లో...



ఎన్నికల నిర్వాహణకు సర్వం సిద్ధం

- నిర్మల్ జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్
- ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లు పరిశీలించిన అధికారులు
- నిర్వాహణపై పలు సూచనలు

8లో...

ఖానాపూర్‌లో టఫ్ ఫైట్..!

- మూడు ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోటీ
- పల్లెల్లో విస్తృత ప్రచారంతో హోరెత్తిస్తున్న వైనం
- విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు
- రసవత్తరంగా మారుతున్న నియోజకవర్గ సమరం

ఖానాపూర్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం. మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గంలో ఎన్నికల సమరం రసవత్తరంగా మారుతోంది. మూడు ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇక్కడ విజయం సాధించేందుకు ఎవరికి వారు తీవ్రంగా శ్రమిస్తున్నారు. జనంలోకి వెళ్లి ముమ్మర ప్రచారం చేస్తుండటంతో విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ నియోజకవర్గంలో రెండు సార్లు గులాబీ జెండా ఎగురగా.. మరోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని భావిస్తుండగా.. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు తొలిసారి పాగా వేసేందుకు సిద్ధమవుతున్నాయి. రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల తరపున పోటీ చేస్తున్న వారితో పాటు పలువురు స్వతంత్రులు సైతం గణనీయమైన ఓట్లు సాధించేందుకు కృషిచేస్తున్నారు. ఇలా ఎవరికి వారు గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తూ రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నారు. పోలింగ్‌కు మరో వారం రోజులు మాత్రమే సమయం ఉండటంతో నియోజకవర్గంలో ప్రలోభాల పర్వం కూడా ప్రారంభమైందనే ప్రచారం జరుగుతోంది.







నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల సమరం మరింత రసవత్తరంగా మారుతోంది. ఇక్కడ అధికార బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీలు గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత దశాబ్దం పాటు పాలించిన బీఆర్ఎస్ తాజా ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కాదని.. కొత్త వ్యక్తి భూక్యా జాన్సన్‌నాయక్‌కు టికెట్ కేటాయించింది. కాంగ్రెస్ నుంచి వెడ్మ బొజ్జుపటేల్, బీజేపీ నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌లు బరిలో నిలిచారు. వీరితో పాటు బీఎస్పీ నుంచి బన్సీలాల్ రాథోడ్‌తో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. నోటిఫికేషన్ నాటి నుంచి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కులాలు, సామాజికవర్గాల వారీగా జనాలను కలుస్తూ తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల అగ్రనాయకుల సభలు కూడా పూర్తికావడంతో విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లోనూ ఎవరు గెలుస్తారనే చర్చ జరుగుతోంది. సొంత సర్వేలు చేయిస్తూ ఎక్కడ బలంగా ఉన్నాం..బలహీనత ఎక్కడుందనే

మిగతా..2లో...

నిర్మల్‌లో హస్తం గట్టెక్కేనా..?

- కాంగ్రెస్ నుంచి ఎన్నికల బరిలో శ్రీహరిరావు
- గతంలో రెండు సార్లు పోటీచేసినా తప్పని ఓటమి
- బరిలో బలమైన ప్రత్యర్థులు..విజయంపై అనుమానాలు

నవతెలంగాణ- నిర్మల్

రాజకీయ కేంద్రమైన నిర్మల్ నియోజకవర్గంలో హస్తం పార్టీకి ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన కూచాడి శ్రీహరిరావు తాజా ఎన్నికల్లో గట్టెక్కుతారా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇది వరకు బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయిన ఆయన తాజాగా కాంగ్రెస్ నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. కానీ ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్ నుంచి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్‌రెడ్డి బరిలో నిలవడంతో పాటు వారిని ఎదుర్కొని రానున్న ఎన్నికల్లోనైనా ఆయన గట్టెక్కుతారా అనే సందేహం వ్యక్తమవుతోంది. మూడు పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొనగా.. కాంగ్రెస్‌కు తొలి నుంచి ఈ నియోజకవర్గంలో ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ మిగితా పార్టీలు సైతం బలంగా ఉండటంతో గెలుపుపై సందిగ్ధం ఉందనే ప్రచారం జరుగుతోంది.



ఓటు బ్యాంకు ఉన్నా..?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే నిర్మల్ నియోజకవర్గం రాజకీయ కేంద్రంగా పిలువబడుతుంది. ఈ నియోజకవర్గంలో 1952 నుండి 2018 వరకు 16 సార్లు అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఇందులో అభ్యర్థులు సోషలిస్టు పార్టీ, స్వతంత్రులు, టిడిపి, పిఆర్‌పి, బీఎస్పీ, బీఆర్ఎస్‌లు గెలుపొందాయి. అలాగే కాంగ్రెస్ అభ్యర్థులు 6 సార్లు గెలుపొందారు. నిర్మల్

మిగతా..2లో...

చెక్‌పోస్టు వద్ద ఎస్పీ వాహనాల తనిఖీ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద గురువారం ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తూన్నట్టు తెలిపారు. ఎన్నికల పరివర్తన నియమావళి జిల్లాలో కట్టుదిట్టంగా అమలుచేస్తామని, నగదు, మద్యంపై, ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిగా ఉంటుందనితెలిపారు. మాడల్ కోడ్ అమల్లో వచ్చినందున ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు బంగారం, ఇతర వస్తువులు తీసుకెళ్లే వారు ఆదారాలు చూపించాలని, లేనిపక్షంలో నగదు, ఇతర వస్తువులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే 1906 లీటర్ల మద్యం స్వాదీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.10 లక్షలపై చిలుకు ఉంటుందని, నగదు రూ.2.21 లక్షలు, 182 మొబైల్ ఫోన్‌లు వాటి విలువ రూ.మూడు లక్షలపై చిలుకు ఉంటుందని అన్నారు. రూ.ఏడు వేల విలువ గల 100 టిఫిన్ బాక్సులు సీజ్ చేయడం జరిగిందని, 3,4041 మందిని ఇప్పటికే బైండోవర్ చేశామని, ఎన్నికల స్వేచ్ఛ నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు. అనంతరం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి ఎస్సై సాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామం గురించి అవగాహన ఉండాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని, ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

నిర్మల్‌లో హస్తం గట్టెక్కేనా..?

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు తనకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. ప్రజల్లో సైతం ఆదరణ కలిగి ఉంది. అయితే 2009, 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ నుండి అభ్యర్థిగా పోటీ చేసి శ్రీహరిరావు ఓటమి చెందారు. మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో పనిచేస్తూ వచ్చారు. 2018 ఎన్నికల్లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి తోడుగా ఉంటూ ఒక విధంగా గెలుపునకు కారణమయ్యారు. అయితే ఆ పార్టీలో సముచిత స్థానం దొరకకపోవడంతో కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇదే సమయంలో 2023 ఎన్నికల సమీపించాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీ నుండి గెలుపొందిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఆ పార్టీ విలీనం కావడంతో కాంగ్రెస్‌లో కొనసాగుతూ వచ్చారు. 2018 ఎన్నికల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. ఇటీవల కాంగ్రెస్ అధిష్టానంతో భేదాభిప్రాయాలతో ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఇదే అదనుగా భావించిన శ్రీహరిరావు కాంగ్రెస్ లో చేరి డీసీసీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అలాగే ప్రస్తుత ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గం టికెట్ సైతం దక్కించుకున్నారు. దీనికి తోడుగా బీఆర్ఎస్ నుండి సారంగాపూర్ జడ్పిటిసి పత్తి రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రముఖ సీనియర్ న్యాయవాది మల్లారెడ్డిలు కాంగ్రెస్‌లో చేరడంతో కొంతమేర కాంగ్రెస్‌కు బలం చేకూరుంది. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం వచ్చి కాంగ్రెస్ శ్రేణులను ఉత్సాహ పరిచారు.

ప్రచారం అంత మాత్రమే..!

ప్రస్తుతం ఎన్నికలు సమీపించడంతో బీఆర్ఎస్, బీజేపీలు ప్రచార హోరును పెంచాయి. కానీ కాంగ్రెస్ మాత్రం అతంత ప్రచారానికే పరిమితమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పాత ఓటు బ్యాంకు, కొంత మైనార్టీల ఓటు బ్యాంకు తప్ప కొత్తగా తమకంటూ ఓటు బ్యాంకు సాధించలేకపోవడం కాంగ్రెస్‌కు మైనస్ పాయింట్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. దీనికి అభ్యర్థి శ్రీహరిరావుపై ప్రజల్లో ఉన్న అసహనమా..? లేదా కిందిస్థాయి నాయకులు తమ బాధ్యత తీసుకొని పని చేయకపోవడం కారణమా అనేది ప్రశ్నగా మిగిలిపోతోంది.

బరిలో బలమైన ప్రత్యర్థులు..!

నిర్మల్ నియోజకవర్గంలో 2023 ప్రస్తుత ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన బిఆర్ఎస్, కాంగ్రెస్,బీజేపీ మధ్య త్రిముక పోటీ నెలకొంది. అయితే బీఆర్ఎస్ నుంచి అనుభవజ్ఞుడైన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ నుంచి బరిలో నిలిచిన సీనియర్ నాయకుడైన మహేశ్వర్‌రెడ్డిలు బరిలో ఉన్నారు. వీరికి పార్టీతో పాటు సొంత ఓటు బ్యాంకు కలిగి ఉండటంతో వీరిని తట్టుకొని కాంగ్రెస్ అభ్యర్థి గట్టెక్కుతారా అనేది అనుమానంగా మారుతోంది. జోరుగా ప్రచారాలతో పాటు ముఖ్య నాయకులకు బాధ్యతను ఇస్తూ, నమ్మకస్తులతో ప్రచారం చేయడం, ఓటు బ్యాంకును పెంచుకుంటే తప్పా విజయం సాధించడం అంత సులువు కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది..

ఖానాపూర్‌లో టఫ్‌ఫైట్..!

(మొదటి పేజీ తరువాయి)

విషయమై ఆరా తీసి సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోపక్క పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో నియోజకవర్గంలో ప్రలోభాల పర్వం కూడా ప్రారంభమైనట్లు ప్రచారం జరుగుతోంది.

విజయం ఎవరి వైపు..!

మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో చివరకు విజయం ఎవరిని వరిస్తుందోననే ఉత్కంఠ రేపుతోంది. నియోజకవర్గంలో బీఆర్ఎస్ వరుసగా రెండు గెలవడంతో ఈ సారి ఇక్కడి నుంచి భూక్యా జాన్సన్ నాయక్‌ను బరిలో దింపింది. మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడు కావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజల్లో విస్తృతంగా పర్యటించడం, తన సామాజికవర్గం ఓట్లు కలిసి వస్తాయనే కారణాలు సానుకూలంగా మారుతుండగా స్థానికేతరుడనే ముద్ర, కొత్తగా తొలిసారి పోటీలో ఉండటం, స్థానికులతో పూర్తిస్థాయిలో పరిచయాలు లేకపోవడం ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన వెడ్మ బొజ్జు పటేల్ నియోజకవర్గంగా సుపరిచితుడు కావడం, తన సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండటం, ప్రస్తుతం కాంగ్రెస్ గాలి వీస్తుందనే ప్రచారం ఆయనకు తాజా ఎన్నికల్లో సానుకూలంగా మారగా.. నియోజకవర్గ కాంగ్రెస్‌లో బలమైన పార్టీ నాయకత్వం లేకపోవడం వంటివి అవరోధంగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక బీజేపీ నుంచి బరిలో నిలిచిన మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్లకు పరిచయస్తుడు కావడం, ఇది వరకు పలుమార్లు ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం, ఆయన సామాజిక వర్గం ఓట్లు తాజా ఎన్నికల్లో సాను కూలంగా మారనుందని తెలుస్తుండగా.. బరిలో బలమైన ప్రత్యర్థులు ఉండటం, పార్టీలో కింది స్థాయి క్యాడర్‌కు రాజకీయ అనుభవం లేకపోవడం వంటి కారణాలు ప్రతికూలంగా మారనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క బీఎస్పీ నుంచి బరిలో దిగిన బన్సీలాల్ రాథోడ్ సైతం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ విజయం కోసం శ్రమిస్తున్నారు. ఓట్లను గణనీయమైన సంఖ్యలోనే చీల్చే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల తరపున పోటీ చేస్తున్న వారితో పాటు స్వతంత్రులు సైతం వేల సంఖ్యలో ఓట్లను చీల్చే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఇలా ఎవరికి వారు విజయం కోసం శ్రమిస్తుండటంతో చివరకు గెలుపు ఎవరి దరిచేరుతుందోనని నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారుతోంది.

బర్రెలక్కకు పౌరసంఘాల మద్దతు



నవతెలంగాణ-హాజీపూర్

కొల్లాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బర్రెలక్క(శిరీష)పై జరుగుతున్న దాడులను ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలని వివిధ పౌర సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మంచిర్యాల రాముని చెరువు కట్టపై వాకర్స్ అసోసియేషన్ తరపున బర్రెలక్కకు మద్దతుగా జరిగిన సంఘీభావ ప్రదర్శనలో వారు పాల్గొన్నారు. నిరుద్యోగుల ప్రతినిధిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న బర్రెలక్కకు అంబేద్కర్ రాజ్యాంగం అందించిన హక్కును కాలరాసే జబర్దస్తీ నడవదని వారు పేర్కొన్నారు. నిరుద్యోగుల బాధలను తీర్చలేని పాలకవర్గాలు ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో నిలిచి నిరుద్యోగుల తరపున పోరాడుతున్న ఆమెకు ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వాలని అన్నారు. బర్రెలక్కకు పోలీసు రక్షణ కల్పించాలని, ప్రజలందరూ మద్దతు తెలిపి చట్టసభల్లోకి పంపించాలని కోరారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు బర్రెలక్కకు మద్దతుగా స్పందించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాముని చెరువు వాకర్స్ కమిటీ అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, ట్రేడ్ యూనియన్ నాయకులు కామిల్ల జయరాజు, అబ్దుల్ పాషా, గుంతి ప్రభాకర్, మొగిలి తిరుపతి, కొండపాక ప్రభాకర్, డాక్టర్ గోలి పూర్ణచందర్, ఐలయ్య, అడ్వకేట్ కొట్టె తిరుపతి, సిరికొండ సురేందర్, సూర్యనారాయణ గౌడ్, మూర్తి పాల్గొన్నారు.

బీజేపీ బహిరంగ సభను అడ్డుకుంటాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించే బీజేపీ బహిరంగ సభను అడ్డుకుంటామని టీఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మెన ధర్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి హామీ ఇచ్చి 10 సంవత్సరాలైనా కనీసం ఎస్సీ వర్గీకరణ అంశంపై నోరు మెదపని బీజేపీ ఎన్నికల సమయంలో వర్గీకరణ పేరుతో కొత్త నాటకానికి తెరతీసిందన్నారు. మాదిగలను మరోసారి మభ్యపెట్టడానికి మాదిగల విశ్వరూప మహాసభ పెట్టి ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి కమిటీల పేరుతో మరోసారి మాదిగలను మోసం చేయడానికి బీజేపీ నాయకులు కుట్ర పన్నుతున్నారని దీనిపట్ల మాదిగలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో బీజేపీ మంత్రి నిర్మల సీతారామన్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని కళాఖండిగా చెప్పిందని గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా ఎస్సీ వర్గీకరణ పాట పాడుతూ బీజేపీ నాటకం ఆడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నేడు కాగజ్‌నగర్ పట్టణానికి వస్తున్న ఆదిత్య యోగి నాథ్ పర్యటన అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంబాల రవి పాల్గొన్నారు.

సమస్యలపై నిర్దిష్ట హామీలివ్వని పార్టీలకు గుణపాఠం చెప్పండి



నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై నిర్దిష్ట హామీలు ఇవ్వని పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని ఎస్సీకేఎస్ (సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ ఓసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు రాజకీయ పార్టీలు ఆధ్వర్యంలో గోడపత్రులను విడుదల చేశారు. ఈ సందర్భంగా గట్టు మహేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 30న జరుగుతున్న శాసనసభ ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలను ప్రకటించాయని అందులో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల గురించి ఏ రాజకీయ పార్టీ కూడా నిర్దిష్టమైన హామీని ఇవ్వడంలో వివక్షనే చూపించాయన్నారు. కోల్ బెల్టు ప్రాంతాలలో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులు సుమారు 25వేల మంది వారి కుటుంబ సభ్యుల ఓట్లు, గెలుపోటములను నిర్ణయించే అవకాశం ఉందని, అయినా ప్రధాన రాజకీయ పార్టీలు ఏవి కూడా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల గురించి ఎక్కడ ప్రస్తావించకపోవడం అంటే కార్మికుల, వారి కుటుంబ సభ్యుల ఓట్లకు దూరం అవ్వడం అని ఆ పార్టీ నాయకత్వం గుర్తించాలని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదని, నిండు అసెంబ్లీలో సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులే లేరని ముఖ్యమంత్రి ప్రకటించడం, అంతేకాకుండా ఈ మధ్యకాలంలో కేటీఆర్, కేసీఆర్ పర్యటించిన సందర్భంలో కూడా ఎక్కడ కూడా కాంటాక్ట్ కార్మికుల సమస్యలపైన, వేతనాల పైన ప్రస్తావించిన దాఖలాలే లేవని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులపైన బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి చాలా స్పష్టంగా కాంట్రాక్టు కార్మికులకు అర్థమైందని, ఇచ్చిన కనీస వేతనాల జీవోలను కూడా మూడు సంవత్సరాల నుంచి గెజిట్ చేయకుండా మూలన పెట్టేసిందని ఆరోపించారు. సింగరేణి కాంటాక్ట్ కార్మిక వర్గం ఈసారి మార్పుకై ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని, ఏ రాజకీయ పార్టీలు అయితే సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు స్పష్టమైన హామీ ఇస్తారో ఆ రాజకీయ పార్టీలకే సింగరేణి కాంటాక్ట్ కార్మికుల ఓట్లు వేసి, కార్మికులను విస్మరించిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్పే విధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సీఐటీయూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమ్మయ్య, సంపత్, సురేష్, సన్ని, రమేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తేనే సంక్షేమ పథకాలు అమలు

● ఎమ్మెల్సీ దండే విఠల్

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకాలు నిర్విఘ్నంగా అమలవుతాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచారం చేసిన అనంతరం పార్టీ కార్యాలయంలో పత్రికా విలేకరులతో మాట్లాడారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం వైపే ఉన్నారన్నారు. కారు గుర్తుకు ఓటువేసి కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్ నాయక్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యుడు అలీ ఖాన్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, సులువ జనార్ధన్, పీఎసీఎస్ చైర్మన్ శీలం చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, జిల్లా నాయకులు భరత్ కుమార్, నర్సగౌడ్, హరీష్‌గౌడ్ ముత్యం, సాయి పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు

ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జాన్సన్ నాయక్ గెలవాలని సర్పంచ్ జక్కు భూమేష్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భారీ మెజార్టీతో గెలవాలని వేడుకున్నట్లు తెలిపారు. తపాలాపూర్ గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీపతి బుచ్చన్న గ్రామ సర్పంచ్ నైనాల తిరుపతి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. జన్నారంలో ఎంపీటీసీ మమ్మద్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
శుక్రవారం నవంబర్ 24, 2023

గిరిజనుల అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-కడెం

గిరిజనుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ పార్లమెంట్ సీతారాం నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రామాలయం ప్రక్కన ఏర్పాటు చేసిన గిరిజన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా హజరై మాట్లాడారు. గిరిజనులు, గిరిజనేతరుల అభివృద్ధి సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్, నాయకులు, హపావత్ రాజేందర్ నాయక్, భరత్ చౌహన్, సిద్ధార్థ నాయక్, బంజారా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జాన్సన్ నాయక్ గెలవాలని పొర్లుదండాలు

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందాలని గురువారం ఖానాపూర్ పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు పొర్లుదండాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి దేవతి రాజేశ్వర్, గౌడ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు గుగ్గిల రాజేందర్‌గౌడ్, మాల మహానాడు నిర్మల్ జిల్లా అధ్యక్షులు దాసరి రాజన్న, మున్నూరుకాపు సంఘం మండల నాయకులు సుతార్ శంకర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ద్విచక్రవాహనంపై వెళుతూ చెట్టుకు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఖానాపూర్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖానాపూర్ పట్టణంలోని పద్మావతి నగర్‌కు చెందిన ముర్తురి వెంకయ్య(52) కడెం మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా రహదారిలో కుక్క అడ్డంగా రావడంతో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దివ్యాంగుల ముందస్తు సంబురాలు

నవతెలంగాణ-నిర్మల్

స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులు ముందస్తు సంబురాలు నిర్వహించుకున్నారు. బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మరోసారి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ముందస్తుగా కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా దివ్యాంగులకు పెన్షన్ అందుతోందని అన్నారు. అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు అందుతున్నాయని ఆన్నారు. సమాజంలో దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నిర్మల్ యోజకవర్గంలో 3వేలకు పైగా ఉన్న సంఘ సభ్యులు ముక్తకంఠంతో, ఏకభిప్రాయంతో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజేశ్వర్, గంగారాం, శ్రీనివాస్, వసీమ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఖానాపూర్‌లో ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈనెల 21న అసెంబ్లీ ఎన్నికల సంబంధించిన పీఓలకు శిక్షణ తరగతులు బాసర ట్రిపుల్ ఐటిలో ఉండేనాని అన్నారు. వీరికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుటకు సౌకర్యము కల్పించిందని తెలిపారు. ఉట్నూర్ రిటైనింగ్ ఆఫీసర్ జీవాకర్‌రెడ్డి నిర్లక్ష్యంతో సమయం 5:15 వరకు ఉట్నూర్ నుంచి బ్యాలెట్ పేపర్స్ రాలేదని పేర్కొన్నారు. దీనివల్ల ఖానాపూర్ నియోజకవర్గ ఉద్యోగ ఉపాధ్యాయులు బ్యాలెట్ ఓటుకు దూరమయ్యారని తెలిపారు. దీనిపై అదిలాబాద్, నిర్మల్ జిల్లా కలెక్టర్‌లు వెంటనే ఆర్ఓపై చర్య తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఉద్యోగ ఉపాధ్యాయ ఓటింగ్ హక్కును వినియోగించేందుకు ఖానాపూర్‌లో ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

అంతుచిక్కని ఓటరు నాడి

- అయోమయంలో నిర్మల్ నియోజకవర్గం అభ్యర్థులు
- డిసెంబర్ 3ననే తేలనున్న భవితవ్యం



నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల సమయంలో నిర్మల్ నియోజకవర్గ ఫలితాలు రాష్ట్ర ఎన్నికల ఫలితాలకు భిన్నంగా ఉంటూ వస్తున్న సంఘటనలు ఉన్నాయి. ఖచ్చితంగా గెలుస్తామన్న నాయకులు ఓటమిపాలైన సందర్భాలు చాలా ఉన్నాయి. ప్రస్తుతం ఈ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం నిర్మల్ నియోజకవర్గం ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు, ఇతర పార్టీల అభ్యర్థులకు ఓటరు నాడి అంతుచిక్కడం లేదు. దీంతో స్వతంత్రులు, అంతా గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులను పక్కన పెడితే, ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు ఈ విషయం అయోమయానికి గురిచేస్తుంది.

అయోమయంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు...

నిర్మల్ నియోజకవర్గంలో 2 లక్షల 47 వేల 495 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 15న నామినేషన్ ఉపసంహరణ ఘట్టం ముగిసేసరికి, ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు ఉన్నారు. అయితే ఇందులో 10 మంది అభ్యర్థులు నియోజకవర్గంలో అంతగా ఆదరణ లేని పార్టీలకు సంబంధించిన వారు, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. కాగా ఇక ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ నుంచి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కూచాడి శ్రీహరిరావులు ముఖ్య అభ్యర్థులుగా పోటాపోటీగా ఉన్నారు. అయితే ఇప్పటికే ఈ మూడు పార్టీల అభ్యర్థులు నియోజకవర్గంలోని ముమ్మరంగా ప్రచారాలు చేస్తూనే ఉన్నారు. అలాగే జాతీయ, రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులతో బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రచారాలు చేస్తూ వస్తున్నారు. ప్రతి చోట వీరికి ప్రజాదరణ ముమ్మరంగా దొరుకుతూ వస్తుంది. కానీ ఈ ఆదరణ అభ్యర్థుల్లో తమకే ఓటు వేసేలా ఉందని భరోసాని మాత్రం నింపడం లేదు. ఎందుకంటే ఈ మూడు పార్టీల అభ్యర్థుల ప్రచారాలు, చేరికల్లో ఎక్కువ మంది ఓటర్లు పలుమార్లు పార్టీలు మారుతూ, కండువాలు కప్పుకుంటూ, ఏ అభ్యర్థి పిలిస్తే ఆ అభ్యర్థికి జై కొట్టడం జరుగుతూ వస్తుంది. దీంతో ఒక నిర్దిష్టమైన తమకు ఓటు బ్యాంకు ఉందని, వస్తుందని, గెలుస్తామని నమ్మకం మాత్రం అభ్యర్థుల ముఖాల్లో కనబడటం లేదు. అయినప్పటికీ తామే గెలుస్తున్నామని పైపైన అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తూ వస్తున్నారు. కానీ ఓటర్లు ఎవరు ఏ పార్టీకి ఓటు వేస్తారని అభ్యర్థులు అంతర్గతంగా అయోమయం చెందుతున్నారు. అయినప్పటికీ తమ ప్రయత్నం తాము రాత్రి అనకా, పగలనక ఏదో రకంగా ప్రచారంలో మునిగి తేలుతున్నారు. మొత్తానికి నిర్మల్ నియోజక వర్గ ఈ అభ్యర్థుల భవితత్వం డిసెంబర్ 3న వెలువడే ఫలితాలపైనే భవితత్వం తేలనుంది.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు, యువకులు

నవతెలంగాణ-కడెం

కన్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న క్యాంపు గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ సమక్షంలో 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జాన్సన్ నాయక్ బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చిన్న బెల్లాల్ నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గొర్ల మధుకర్, కిరణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, బెల్లాల్ ఎంపీటీసీ సుద్దాల లక్ష్మీ జగన్, ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ మండల అధ్యక్షులు కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, కరుణాకర్, వెంకటేశం, మల్లేష్, జాడి నర్సయ్య, కోటయ్య, కొమురయ్య, లక్ష్మణ్, నగేష్, పీసరి రవి, రంజిత్, రామ్ కిషోర్, ప్రశాంత్, టౌన్ అధ్యక్షులు కే రవి, బాలు, సన్నీ, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సమ న్యాయం

- కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ బొల్లోజి నర్సయ్య

నవతెలంగాణ-సారంగాపూర్

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ బోల్లోజి నర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆరు గ్యారంటీల కార్డులను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని అన్నారు. ఈ ఎన్నికల్లో చేతుగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావును గెలిపించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి, రాజురెడ్డి, పోతన్న, భోజన్న, ఎస్‌కె సలీం, భీమ్‌రావు, భూమన్న పాల్గొన్నారు.



ఇంటింటికి కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తున్న నాయకులు

నృత్యంలో రాణిస్తూ..రికార్డులు సాధిస్తూ..!

• పిన్న వయసులోనే ప్రతిభ కనబరుస్తున్న ఇతీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

చదువే కాదు..కళల్లోనూ ప్రావీణ్యం సంపాదిస్తోంది. అతి చిన్న వయసులోనే అందరి చేత శభాష్ అనిపించుకుంటూ రికార్డులను సొంతం చేసుకుంటోంది ఆదిలాబాద్ పట్టణం కైలాస్‌నగర్‌కు చెందిన కొంకటి సృజన-శ్రవణ్‌కుమార్ దంపతుల కూతురు కొంకటి ఇతీక్ష. నృత్యంలో రాణిస్తూ అందరి ప్రశంసలు పొందుతోంది. తాజాగా ఇటీవల వండర్‌బుక్ ఆఫ్ రికార్డుల్లోనూ తన పేరును నమోదు చేసుకొని ప్రతిభ కనబరుస్తోంది.



అవార్డులు సొంతం..!

ఆదిలాబాద్ పట్టణం లిటిల్‌స్టార్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఈ చిన్నారి తొలి నుంచి నృత్యంలో ఆసక్తి ఉంది. ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు ఏడాది నుంచి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇప్పించారు. బాల కేంద్రంలో ప్రముఖ శిక్షకులు మిట్టుపల్లి దగ్గర నృత్యంలో మెళకువలు నేర్చుకున్న ఈ చిన్నారి నృత్యంలో ప్రతిభ కనబరుస్తూ అవార్డులను సొంతం చేసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక ప్రదర్శనలిచ్చారు.

పురస్కారాలు అందుకున్నారు.

శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాల్లో ప్రావీణ్యం పొందిన ఈ చిన్నారి అనేక అవార్డులు అందుకున్నారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా హైదరాబాదు కళా నిలయంలో నిర్వహించిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదర్శనలో సత్తాచాటి మెమొంటోను అందుకుంది. మహారాష్ట్రలోని వార్దాలోని నిర్మల మల్టీపర్పస్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్‌ఇండియా ఫస్ట్ నేషనల్ డ్యాన్స్ పోటీల్లో కూచిపూడి నృత్య విభాగంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ జాతీయస్థాయి పోటీల్లో తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొని నృత్యాలు చేసిన వారిలో మన రాష్ట్రం నుంచి పదకొండు మందిలో ఇతీక్షకు చోటు లభించడం విశేషం. ఇంటర్నేషనల్ కర్ణాటిక్ మ్యాజిషన్స్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన పది ప్రపంచ రికార్డుల్లో సైతం కొంకటి ఇతీక్ష పాల్గొని చోటు దక్కించుకుంది. ఈమె నృత్యానికి మంత్రముగ్ధులైన పలువురు సినీ కళాకారులు ప్రత్యేకంగా అభినందించారు.



ఎయిడ్స్ రోగులను అంటరాని వారిగా చూడొద్దు

నవతెలంగాణ-తలమడుగు

ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, మానవుల తప్పిదం వల్లే వస్తుందని ప్రాజెక్ట్ మేనేజర్ భాను అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ భాను మాట్లాడుతూ గ్రామాల్లో ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిని అంటరాని వారిగా చూడకుండా మానవత్వంతో చూసుకునే బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. విద్యార్థి దశ నుంచి ఎయిడ్స్ సంక్రమంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతల్లో ఎయిడ్స్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం స్టేట్ ఎయిడ్స్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు, ఎన్ఎస్ఎస్ పీఓ లింగన్న, అధ్యాపకులు రమేష్, సూర్యకాంత్, పాపయ్య, సచిన్ కుమార్, రమాదేవి, కృష్ణ, మహేష్, దినేష్, రవికాంత్, సొసైటీ జీఎన్ఎం రాధిక, ఓడబ్ల్యూ లలిత పాల్గొన్నారు.

• ప్రాజెక్టు మేనేజర్ భాను



పిప్పల్‌ధరి మండల యువజన సంఘం ఎన్నిక




నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండల సాధనయే లక్ష్యంగా పిప్పల్‌ధరి మండల యువజన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గురువారం మండలంలోని ఖండాల గ్రామంలో పిప్పల్‌ధరి ప్రాంత యువకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిప్పల్‌ధరి మండల యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తొడసం సంతోష్, ఉపాధ్యక్షుడిగా నైతం జాను, ప్రధాన కార్యదర్శిగా నైతం రంజు, సహాయ కార్యదర్శిగా ఆత్రం దిగంబర్, కోశాధికారిగా మార్సుకోల యశ్వంత్, కార్యవర్గ సభ్యులుగా సచిన్, నగేష్, లాల్‌శావ్, రాహుల్, సలహాదారుడుగా తెలంగ్ అజయ్ కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ మారుమూల గ్రామమైన పిప్పల్‌ధరి ప్రాంతాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలం ఏర్పాటు చేసేంత వరకు సాధన కమిటీ సూచనల మేరకు సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జగ్జీవన్, కృష్ణ, విజయ్, శరత్, శత్రుఘన్, చిత్రు, సురేష్, దినేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని బోథ్ అభ్యర్థి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండలంలోని దిగ్నూర్, రాంపూర్, గంగాపూర్ గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలపై సంతకం పెడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉచిత కరెంట్‌ను అమలు చేస్తామన్నారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. రూ. 500లకే గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, పేద మహిళలకు బ్యాంకు అకౌంట్‌లో రూ.2500లు జమ చేస్తామని, రైతులకు ప్రతి ఏటా రూ. 15వేలు, ప్రతి వ్యవసాయ కార్మికునికి సంవత్సరానికి రూ.12 వేలు అందిస్తామని, గృహ నిర్మాణం కోసం రూ.5 లక్షలు కేటాయిస్తామని తెలిపారు. ఈఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమన్‌పెల్లి శేఖర్, మల్లెపూల నరసయ్య, జల్కే పాండురంగ్ పాల్గొన్నారు.



అన్ని వర్గాల ప్రజల చూపు కారు వైపే



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో అన్ని వర్గాల ప్రజలు కారు వైపే చూస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు పిడుగు సంజీవరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కజ్జర్ల, ఉండం, ఝరి, డోర్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు కలుస్తూ కారు గుర్తుకు ఓటేసి అనిల్ జాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కంది నర్సింలు, మల్లేష్, పొచ్చన్న, మహేష్, ఆసం రవి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యకరంగా ఉంటుందని అంకోలి పీహెచ్‌సీ వైద్యులు సర్ఫరాజ్ అన్నారు. గురువారం పీహెచ్‌సీలో ఖండాల, ఖానాపూర్ సబ్ సెంటర్ల పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 11 మందికి పరీక్షలు నిర్వహించి మాత్రలను అందించారు. అనంతరం ఏడుగురికి న్యూట్రిషియన్ కిట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్ మడావి శ్రీనివాస్, ఫార్మసిస్ట్ అలం, సూపర్‌వైజర్లు వసంత, బొమ్మెత సుభాష్, ఆడే సురేష్, కొడప యశోధ, మర్సుకోల లక్ష్మీ బాయి, స్టాఫ్ నర్స్ ధృపత, మీనా, హెల్త్ అసిస్టెంట్ పవార్ ప్రేమ్‌సింగ్, ఆశాలు దమ్మశీల పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

నవతెలంగాణ-బేల

మండల కేంద్రం నుండి తరలిస్తున్న మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం బాలుగూడ గ్రామానికి చెందిన వ్యక్తి మద్యాన్ని తరలిస్తున్న సమయంలో తనిఖీ చేసి పట్టుకున్నామని ఎస్సై రాధిక తెలిపారు. అతని వద్ద 80 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ. 17, 820 ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అక్రమంగా మద్యం, ఇతర వాటిని తరలిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాలికల అథ్లెటిక్స్ పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాలల క్రీడ సమాఖ్య(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 25న ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడ పాఠశాలలో అండర్-14 బాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు పాఠశాల హెచ్ఎం, లేదా ప్రిన్సిపాల్ నుండి నాలుగు ఎటిజిబిలి ఫామ్స్ తీసుకొని, బోనఫైడ్, ఆధార్ కార్డు (జిరాక్స్) సమర్పించాలన్నారు. ఈ ఎంపిక పోటీలు టీఎమ్ఎస్ఎస్ హెచ్ఎం కృష్ణారావ్, టీడబ్ల్యూ స్పోర్ట్స్ అధికారి మీనా రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా జట్లు ఉదయం 9 గంటల లోపు రిపోర్ట్ చేసేలా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శులు సహకరించాలని కోరారు. పూర్తి వివరాల కోసం స్పోర్ట్స్‌ఆఫీసర్ మీనా రెడ్డి 9440010453, అథ్లెటిక్స్ క్రీడ శిక్షకుడు విద్యాసాగర్ 8008090626ను సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని రాజులగూడ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళ సంఘం సభ్యురాలు కృష్ణవేణి ఇటీవల మృతి చెందింది. సరస్వతి గ్రామ సంఘం ఆధ్వర్యంలో గురువారం కుటుంబ సభ్యులకు పరామర్శించి రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని ఐకెపి ఏపీఎం మైసా రమేష్ అందించారు. ఆయన వెంట సర్పంచ్ రాథోడ్ సావిందర్, సీసీలు కాంబ్లే సంతోష్, శ్రీరామ్, వీఓఏలు శారద, అవినాష్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలి

● మాల, మహార్ సంఘం నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

మాదిగ విశ్వరూప మహాసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక వర్గానికి అనుకూలంగా మాట్లాడడం ఆయన హోదాకు తగదని మాల, మహార్ సంఘ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ప్రధాని మోదీ ఒకే వర్గానికి మద్దతు తెలపడం రాజకీయ దురుద్దేశమేనని మండిపడ్డారు.ఎస్సీ వర్గాల్లో విభజించి పాలించు అనే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాల మహా సంఘం నాయకులు దేవన్న, కాడే శ్రీనివాస్, సంతన్న, భగత్ గంగారాం, పురుషోత్తం, బుద్దన్న, భూమన్న, ప్రవీణ్, హర్షవేణు, కాడే రమేష్, నక్క దినేష్ పాల్గొన్నారు.

యువకుడి వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య

● మృతికి కారణమైన వ్యక్తి ఇంటివద్ద ఆందోళన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

యువకుడి వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. నిర్మల్ పట్టణంలోని బెస్తవార్‌పేటకు చెందిన నాగమణికి పార్‌పెల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం అయింది. రెండు సంవత్సరాలుగా నిర్మల్‌లోని తల్లిగారి ఇంటి వద్దే ఉంటుంది. పార్‌పెల్లి గ్రామానికి చెందిన వంశీ వ్యక్తి ఫోన్, వాట్స్‌ప్‌లో మేసేజ్‌ల ద్వారా వేధిస్తున్నాడు. ఫోటోలను మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురి చేశారు. భర్త పిల్లల్ని చంపుతానని బెదిరించేవాడు. యువకుడి వేధింపులను భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం వంశీకి తెలియజేసిన ఎలాంటి స్పందన రాలేదు. నాగమణి భర్త దుబాయ్ నుండి వచ్చి భార్య మృతదేహాన్ని పార్‌పెల్లిలోని వంశీ ఇంటివద్ద ఉంచి ఆందోళన చేశారు. సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సై సంతోషం రవీందర్, లక్ష్మణచాంద ఎస్సై సల్లా శ్రీకాంత్ అక్కడికి చేరుకున్నారు. ఆందోళన కారులతో మాట్లాడారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-కడెం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన గురువారం మండలంలోని పాండ్వాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆర్కం రాజన్న ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లోని నగదు, బంగారం, బట్టలు, ఇంట్లో సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపకశాఖకు సమాచారం ఇచ్చారు. ఫైర్‌ఇంజన్ వచ్చేసరికి స్థానికులు మంటలను అదుపులోకి తెచ్చారు. కాలిపోయిన ఇంటి నష్టం నగదు సామగ్రి మొత్తం విలువ అధికారులు పూర్తి విచారణ జరిపినా తర్వాత తెలుపుతామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

నవతెలంగాణ - కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఓటర్లను కలిసి ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికల ఆవశ్యకత అనే అంశంపై క్షేత్ర స్థాయి అధ్యయనం నిర్వహించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బీమాజీ, ఎన్.లింగమూర్తి నేతృత్వంలో ఈ అధ్యయనం చేపట్టినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు బీమాజీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం మనుగడ కొరకు ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

రోడ్లు వేశారు..స్పీడ్ బ్రేకర్లు మరిచారు..

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలో ఇటీవల రోడ్ల మరమ్మత్తులతో పాటు బీటీ రోడ్లు వేశారు. వాహనదారుల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసే స్పీడ్ బ్రేకర్లను వేయడం మరిచిపోయారు. దీని కారణంగా రాజీవ్ చౌరస్తాతో పాటు ఇతర ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులు వేగంగా వస్తు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు పోయే వరకు అధికారులు స్పందించే విధంగా లేరని ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల స్పందించి స్పీడ్ బ్రేకర్లతో పాటు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-నిర్మల్

బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. గురువారం ప్రచారంలో భాగంగా పట్టణంలోని వార్డు నెం.33 భాగ్యనగర్ కాలనీ, ఈద్‌గాం చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటా తిరుగుతూ కారుగుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు చైతన్యరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. కోట్ల అభివృద్ధి చేశాం.. ఆదరించండి

● మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్


ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆ అభివృద్ధిని చూసి ఈ ఎన్నికల్లోనూ తమ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను మరోసారి గెలిపించాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ కోరారు. గురువారం పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ మేనిఫెస్టోలోని హామీలను వివరించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలను మంజూరు చేసిందన్నారు. విద్య, వైద్యం వంటి ప్రధాన రంగాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నామని వివరించారు.

పతి కోసం సతి ప్రచారం...

పట్టణంలోని 34వ వార్డులో ఎమ్మెల్యే జోగురామన్న సతీమణి జోగు రమ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ తన భర్త జోగు రామన్నను కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. మహిళా నాయకురాళ్లు పార్టీ గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా జోగురమ మాట్లాడుతూ ఇంటింటికి సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుండి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అజయ్, రాజు, శ్రీలత, రాము, తిరుపతి, బదాల సుజాత, ఆవుల వెంకన్న, లక్ష్మణ్, నాయకులు సృజన, బుట్టి శివకుమార్, రంగినేని శ్రీనివాస్, గంగేష్, రమేష్, కుర్షీద్, అలోక్, గాజు రాథోడ్, మహేందర్ పాల్గొన్నారు.

బహిరంగ సభలో అలజడులు, అల్లర్లు సృష్టిస్తే ఊరుకోం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కడెం

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నవంబర్ 26న ఖానాపూర్ కేంద్రంలో సీఎం కేసీఆర్ పాల్గొనే బీఆర్ఎస్ బహిరంగ సభలో అలజడులు, అల్లర్లు సృష్టించాలని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని అలా చేస్తే ఊరుకోమని మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆశాజ్యోతి సగటు మనుషుల ప్రతిరూపం కేసీఆర్ సభను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు, యువత, మేధావులు, ప్రజాస్వామికవాదులు విద్యార్థులు అంతా ఒకవక్క అభివృద్ధిని ఆకాంక్షిస్తూ అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నారని అన్నారు. ఈ తరుణంలో బీజేపీ, కాంగ్రెస్ కుట్రపూరితమైన వైఖరితో తెరపైకి తీసుకొస్తూ, సీఎం కేసీఆర్ సభలో అలజడులు సృష్టించాలని అభివృద్ధిని అడ్డుకోవాలని కరపత్రాలు రూపంలో ముందుకు వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో నిర్వహించే భారీ బహిరంగ సభను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, నిర్మల్ జిల్లా జెడ్పీకోఆప్షన్ సభ్యులు ఎండీ రఫిక్ అహ్మద్, కడెం వైఎస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, కడెం సర్పంచ్ కొండాపురం అనూష లక్ష్మణ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు వేణుగోపాల్, మాసాయిపేట్ సర్పంచ్ రాముగౌడ్, అంబారిపేట్ సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న, ధర్మాజీపేట్ సర్పంచ్ వెంకటేష్, పట్టణ అధ్యక్షులు రవి, వివిధ గ్రామాల బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి


రోడ్‌షోలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యమని బీఆర్ఎస్ ముధోల్ ఎమ్మెల్యే అభ్యర్థి జి. విఠల్ రెడ్డి అన్నారు. మండలంలోని విట్టోలి, విట్టోలి తండ, గన్నోర, రువ్వి, బ్రహ్మణగాం, ఆష్టా, భోరిగాం, వడ్తల్, చింతకుంట, చింతకుంట తాండ, ఎడ్ బిడ్ తాండ, ఎడ్‌బిడ్, వెంకటపూర్, చించాల గ్రామలల్లో గురువారం రోడ్ షోను నిర్వహించారు. ఇది వరకు రెండు పర్యాయాలు గెలిపొందిన నేను అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్ళనన్నారు. మరోసారి తనకు అవకాశం ఇచ్చి గెలిపించినట్లయితే తప్పకుండా ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి తిలకం దిద్దారు. ఈ కార్యక్రమంలో నాయకులు విలాస్ గాదేవార్, అఫ్రోజ్ ఖాన్, ఏజాజోద్దీన్, సురేందర్ రెడ్డి, ఖాలిద్, పోతన్న యాదవ్, మురళి, రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాలీల పాట్లు తీర్చే వారికే ఓట్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మాలీలు సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగాల్లో వెనుకబడి ఆంధ్రాలో ఎస్టీలుగా తెలంగాణలో బీసీలుగా పరిగణించబడుతున్నారని అలాంటి మాలీల పాట్లు తీర్చే వారికే ఈ ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్టుకులే అన్నారు. గురువారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన క్రియాశీలక నాయకుల ఆత్మీయ సమ్మేళన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 22 సంవత్సరాలుగా తమవారు అనేక ఉద్యమాలు చేస్తూ పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలీల పాట్లు తెలుసుకొని స్పష్టమైన హామీ ఇచ్చిన అభ్యర్థులకే రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేస్తామని సంఘం క్రియాశీల నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, జిల్లా అధ్యక్షులు విజయ్ వాడగురే, యువజన విభాగం అధ్యక్షులు ధనంజయ ప్రధాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దారట్ల ఉత్తం, కార్యవర్గ సభ్యులు వామన ప్రధాన్, మురళీధర్ నాగోషే, అంబాదాస్ షిండే, శ్రీను ఆచారి, గజానంద్ చౌదరి, రామ్ కిషన్ షిండే, జనార్ధన్ మాందాడే, విజయఅ వాడగురే పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కౌటాల

బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫైనాన్సియల్ లిటరసీ కౌన్సిలర్ ప్రేమ్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో సాంకేతిక అక్షరాస్యత ఆర్థిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భద్రత పథకాలు, సైబర్ నేరాలు, బ్యాంక్ రుణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం



జరిగిందన్నారు. బాంక్ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాఖా నిర్వహణ అధికారి నరసింహస్వామి, క్షేత్రస్థాయి అధికారి మనోహర్, అకౌంటెంట్ రాజేష్, క్యాషియర్ భాస్కర్, మహిళా సంఘాల సీసీలు కుసుమ, రాజమణి, శంకర్, బ్యాంకు మిత్ర నీరజ, టీఎస్‌పీలు మొరేశ్వర్, విలాస్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దహెగాం మండలంలోని రహపల్లి గ్రామంలో రావుల రాకేష్ ఇంట్లో నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. గురువారం సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా ఏడు ఓసీ క్వాటర్ బాటిల్లు, పదమూడు ఆర్ఎస్ క్వాటర్ బాటిల్లు లభ్యమయ్యాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై కిషన్, స్వాతి, సిబ్బంది కుమార్, రవి, హుస్సేన్, మల్లేష్, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్‌లు పంపిణీ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మురళీగూడ, జిల్లెడ ప్రాథమిక పాఠశాలల్లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా అధ్యక్షుడు సతీష్ విద్యార్థులకు పలకలు, నోట్ బుక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కామెర తిరుపతి, తలండి సతీష్, భాస్కర్, ఆనంద్‌రావు, నవీన్, సురేష్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సంతలో పార్టీల ప్రచారం

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని సలుగుపెల్లి వారసంతలో గురువారం కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న క్రమంలో ప్రచార హోరును ఆయా పార్టీలు ఉధృతం చేశాయి. సంతలో నాలుగు పార్టీలకు సంబంధించిన సౌండ్ బాక్సులు హోరెత్తించి ఓటర్లను గందరగోళానికి గురిచేశాయి. ఏ పార్టీ పాట వస్తుందో, నృత్యాలు చేస్తున్నారో అర్థంకానీ పరిస్థితులు నెలకొంది.

జైనూర్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే వారం పోలింగ్ కావడంతో మండల కేంద్రంలోని వారసంతలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు తమతమ ప్రచారాన్ని పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని వారసంతలో ఆయా పార్టీల నాయకులు ఆటపాటలతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కాలేజ్‌గూడ నుండి రాణిదుర్గావతి చౌరస్తా వరకు అన్ని పార్టీల అభ్యర్థుల అనుచరులతో ప్రచారం జోరుగా కొనసాగించారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా సీఐ మల్లేష్, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ ఎస్సైలు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకున్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కౌటాల

సత్యసాయిబాబా జన్మదిన వేడుకలను మండలంలోని మొగడ్‌దగడ్, ముత్తంపేట్, తాటిపెల్లి గ్రామాల్లో 98వ జన్మదిన వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నగరసంకీర్తన సేవలు, దీపోత్సవం, మొగడ్‌దగడ్‌లో సత్యసాయి బాబా పల్లకి ఊరేగింపు, భజన కీర్తనలతో శోభాయాత్ర నిర్వమించారు. అనంతరం ఆలయంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి భక్తులు మణిరాం, ప్రభాకర్, దిలీప్, నరులె విలాస్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : సత్యసాయి బాబా 98వ జన్మదిన వేడుకలను గురువారం పట్టణంలోని సాయి స్వస్థ్య వెల్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి, భజన నిర్వహించి, డాక్టర్లు, పేషెంట్లకు నారాయణ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీఎం డీజీఎం శివరామకృష్ణ, గుంటూరు కాలనీ సుబ్బారావు హాజరై హారతి సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో రఘువీర్ సింగ్, బట్టు మల్లేశం, రాజేశ్వర్, శివ కుమార్, లక్ష్మణ్, అవినాష్, సందీప్, వంశీ, అశోక్ కుమార్, యమున, శ్రీలత పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం మరో అవకాశం ఇవ్వండి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనప్ప

నవతెలంగాణ-బెజ్జూర్

తన హయాంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప అన్నారు. గురువారం మండలంలోని సలుగుపెల్లి, సిద్దాపూర్, ఎలుకపెల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఎన్నో రోడ్లను మంజూరు చేశానని, వాగులపై వంతెన నిర్మాణం చేపట్టామన్నారు. ప్రతి ఇంటికి ఒక ప్రభుత్వ పథకాన్ని అందించామని, వృద్ధులకు ఆసరాగా ఉంటూ ఒక పెద్దన్న పాత్ర పోషించానని ఎమ్మెల్యే అన్నారు. మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దుతామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగ్గాగౌడ్, కొడప విశ్వేశ్వర్, డోకె వెంకన్న, కొట్రంగి రామకృష్ణ, జావీద్ అలీఖాన్, తంగడిపెల్లి మహేష్, పుల్లూరి సతీష్, నాహెర్ అలీ, జాహిద్, షౌకత్ అలీ, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



ఆర్థిక నేరగాళ్ల ను తరిమికొట్టాలి : దాసారపు శ్రీనివాస్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు నియోజకవర్గంలో ఉన్న ఆర్థిక నేరగాళ్లను తరిమికొట్టాలి బీఎస్పీ అభ్యర్థి దాసారపు శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని గద్దరాగడిలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో చెన్నూరు నియోజకవర్గంలో వివేక్ వెంకటస్వామి కుటుంబం పోటీ చేసి గెలిచి ఇప్పుడు వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఇక్కడ అభివృద్ధి చేయకనే వేరే నియోజకవర్గానికి వలస వెళ్లారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేగా పోటీ చేయనని బహిరంగంగానే ప్రకటించిన వివేక్ వెంకటస్వామి ఎందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. రహస్య వీడియో కాల్స్ మాట్లాడడం ద్వారా వివేక్ సుమన్ మధ్య రహస్య ఒప్పందం ఉన్నట్లు స్పష్టం అవుతుందని, గతంలో బీఆర్ఎస్‌లో పని చేసిన బంధం రాబోయే రోజుల్లో కూడా కొనసాగిస్తారనేది స్పష్టమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుణ, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించండి

నవతెలంగాణ-కౌటాల

సార్వత్రిక ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పనుకారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావు అన్నారు. గురువారం మండలంలోని గుండాయిపేట్, తుమ్డిహేటి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోను వివరిస్తు కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే మరోసారి కోనేరు కోనప్పను ఎన్నుకోవాలన్నారు. ఆయన వెంట తుమ్డిహేటి సర్పంచ్ కోరెత్ చరందాస్, మాజీ సర్పంచ్ పత్రు, వీర్దండి సర్పంచ్ మడావి రేణుక, గుండాయిపేట్ ఉప సర్పంచ్ లహంచు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



Format C - 1

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Intaerest Foundation & Ors. Vs. Union of India & Anr)

Name and address of candidate : VENKATESH DASARI
Name of political party : INDEPENDENT
Name of Election : Telangana State Legislative Assembly
*Name of Constituency : 001 SIRPUR

I VENKATESH DASARI (Name of candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

Sl. No.	Name of Court	Case No. and dated	Status of case(s)	Section of Acts concerned and brief description of offence(s)
1.	JFCM Sirpur	CC No. 657 / 2020	Pending	Likely to Spread infection

(B) Details about cases of conviction for criminal offences

Sl. No.	Name of Court & punishment imposed	Description of offence(s) & punishment imposed	Maximum Punishment imposed
1	No	No	No

Sd/-
VENKATESH DASARI

దుర్గం చిన్నయ్య ఓటమే నా లక్ష్యం : శేజల్

నవతెలంగాణ-నస్పూర్



బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను ఓటమియే తన లక్ష్యమని ఆరిజన్ డెయిరీ సీఈఓ శేజల్ అన్నారు. గురువారం నస్పూర్‌లో నవతెలంగాణ విలేకరితో మాట్లాడుతూ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వేధింపులు తాళలేక పోలీస్ స్టేషన్, ప్రభుత్వానికి చాలాసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, అంతేకాకుండా మరల ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం ప్రభుత్వానికి మహిళలపై ఉన్న చిత్త శుద్ధి కనిపిస్తుందని ఆరోపించారు. గతంలో ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని, కానీ ఇప్పుడు తన ఓటమికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. చిన్నయ్య గెలిస్తే మహిళలకు రక్షణ కరువవుతుందన్నారు. ప్రతి మహిళా ఆలోచించి ఓటు వేయాలని, గడపగడపకు తిరిగి ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తానని తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ద్వారా ప్రమాద సూచికలు తనకు ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే అనుచరులు దాడులకు పాల్పడుతున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, పోలీసులు సైతం వారికే కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు.

బాధితులకు పరామర్శ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన గొట్ల తిరుపతి, తోట రాజుకు ఇటీవల రోడ్డు ప్రమాదం జరగడంతో చికిత్స పొంది ఇంటికి వచ్చిన వారిని గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు పుల్లూరి రామన్న, సముద్రాల రాజన్న, నరసింగరావు, రమేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కొరివి చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం బీఆర్ఎస్ జిల్లా నాయకులు నడిపెల్లి విజిత్ రావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచిందని నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్ని విధాల అభివృద్ధి చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

పట్టణంలో బాల్క సుమన్ విస్తృత ప్రచారం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో గురువారం చెన్నూరు అభ్యర్థి బాల్క సుమన్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆర్కే-4 గడ్డ నుండి ర్యాలీగా బయలుదేరి బీ జోన్ సెంటర్‌లో 3, 4, 18, 19 వార్డుల పరిధిలోని ప్రజలతో నిర్వహించిన సభలో మాట్లాడుతూ కాంగ్రెస్‌కి హైకమాండ్ ఢిల్లీ గులాములని, బీఆర్ఎస్‌కి హైకమాండ్ తెలంగాణ ప్రజలేనని తెలిపారు. జీఓ76తో పట్టణంలో దాదాపు నాలుగు వేల ఇండ్లకు పట్టాలిచ్చామన్నారు. తెలంగాణ, చెన్నూరులో వచ్చేది కారేనని, మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. అనంతరం బిజోన్ సెంటర్, రాజీవ్ చౌక్ చౌరస్తాలో తిరుగుతూ మేనిఫెస్టోని ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు.

ఎన్నికల నిర్వాహణకు సర్వం సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈనెల 30న జరిగే పోలింగ్ నేపథ్యంలో గురువారం పట్టణంలోని మినీ ఎన్టీఆర్ స్టేడియంలో ఈవీఎం, వీవీప్యాట్స్, సీయూల కమీషనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. నిర్మల్ నియోజకవర్గానికి 306 పోలింగ్ కేంద్రాలకు 382 బ్యాలెట్ యూనిట్లు, 382 కంట్రోల్ యూనిట్లు, 428 వీవీప్యాట్స్, 28 రూట్ కౌంటర్ల ద్వారా, ఖానాపూర్‌లో 305 పోలింగ్ కేంద్రాలు, 381 బ్యాలెట్ యూనిట్స్, 427 వీవీప్యాట్స్ 381 కంట్రోల్ యూనిట్లు, ముధోల్‌లో 311 పోలింగ్ కేంద్రాలు, 388 బ్యాలెట్ యూనిట్స్, 435 వీవీప్యాట్స్, 388 కంట్రోల్ యూనిట్ల కమీషనింగ్ నిర్వహణ జరిగింది. ఈ ప్రక్రియపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నాడు సంక్షోభం.. నేడు సంక్షేమం..

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగు రామన్న



ఎన్నికల ప్రచారంలో భాగంగా కేఆర్‌కే కాలనీలో రోడ్ షోలో మాట్లాడుతున్న రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

కాంగ్రెస్, బీజేపీల హయాంలో కర్ఫ్యూ కరువులే రాజ్యమేలాయని నేటి సీఎం కేసీఆర్ పదేండ్ల సుభిక్ష పరిపాలనలో సంక్షేమం విరాజిల్లుతుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కేఈఆర్‌కే కాలనీ, పిట్టలవాడ, కైలాస్‌నగర్ కాలనీలలో విస్తృతంగా పర్యటించారు. కాలనీలకు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. పాటలకు అనుణంగా కార్యకర్తలు నృత్యాలు చేస్తూ ప్రచారంలో ఉత్సహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు, మేనిఫెస్టోను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి మరోసారి అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. అరవై ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజానికానికి చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని వివరించారు. ఎంపీగా గెలిచిన తర్వాత ఏ ఒక్క అభివృద్ధి పనిని చేపట్టని స్థానిక బీజేపీ నాయకులు కేంద్రం నుండి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఆరోపించారు. బీజేపీకి అభివృద్ధిపై ఎంతమాత్రం చిత్తశుద్ధి లేదన్న ఆయన కాంగ్రెస్ నాయకుల వైఖరిపై సైతం ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అంజుబాయి, సంగీత ధమ్మపాల్, రాంకుమార్, గంగారెడ్డి, ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు నజీర్ అహ్మద్, నాయకులు యూనుస్ అక్బాని, దుర్గం శేఖర్, సలీం పాషా, ఆశన్న, దాసరి రమేష్, నవాతే శ్రీనివాస్, చిన్న పటేల్, మున్నా పాల్గొన్నారు.

జోనల్ లెవెల్ క్రికెట్ ఎంపిక పోటీలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లా పాఠశాలల క్రీడ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీ మైదానంలో క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాధికారి పి. అశోక్ మాట్లాడుతూ పాఠశాల ఆటల ఫెడరేషన్ ద్వారా జిల్లాలో నైపుణ్యం కలిగిన విద్యార్థులను వెలికి తీయడానికి వ్యాయామ ఉపాధ్యాయులు చాలా కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపాలని, వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు ఆయా పాఠశాలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏసీజీఈ ఉదయ్ బాబు, డీఎస్ఓ మధుకర్, కేజీబీవీ ఎస్ఓ ఆభిద్ అలీ, పీఈటీ మధుసూదన్, వెంకటేష్, పరామశివ, శారద, హరీష్, ఏడుకొండలు, కృష్ణ ప్రసాద్, సారంగపాణి, తిరుపతి, గురువేందర్, సుధాకర్, బాబు సింగ్, విష్ణు పాల్గొన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఆదరించండి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని మంజీరామ్ తాండా, టెంబి, అనంతపూర్, దేగామ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సంధ్బంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ రైతులకు 3 గంటల కరెంట్ చాలన్న కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దామా..? లేక 24 గంటల కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపుదామో రైతులు ఆలోచించాలన్నారు. వారెంటు లేని కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి అనేక రకాల సంక్షేమ పథకాలను కొడంగల్ నియోజకవర్గంలో పార్టీలకతీతంగా అందించినట్లు వివరించారు. ఎన్నికల తర్వాత తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, కేసీఆర్ బీమా, రూ. 400కే గ్యాస్ సిలిండర్ అందించడంతో పాటు గృహలక్ష్మి, బీసీ బంధు, దళిత బంధును అర్హులైన వారికి దశాల వారీగా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మహిళాలతో మాట్లాడుతున్న అనిల్ జాదవ్

కుటుంబాన్ని పరామర్శించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని కుండి సేకుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ కుమ్ర సొంబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని తమ వంతుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గంగన్న, కార్యకర్తలు ఆత్రం నగేష్, కొట్నాక్ సక్కు, మండల నాయకులు కొడప ఈశ్వర్, కొట్నాక్ ఆనందరావ్ గ్రామస్తులు ఉన్నారు.



ముమ్మరంగా స్వతంత్ర అభ్యర్థి ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నిక్ల బరిలో ఉన్న సంజీవ్ రెడ్డి రూరల్ మండలంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. గురువారం టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌లతో కలిసి మండలంలోని కచ్‌కంటి, యాపల్ గూడ, బుర్నూర్, శివఘాట్, రాంపూర్, రామాయి గ్రామాల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామాల్లో వారికి ప్రజలు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తమను మోసం చేయడంతోనే ఉమ్మడి అభ్యర్థిగా సంజీవ్ రెడ్డిని బరిలో నిలపామని సాజిద్ ఖాన్, సుజాత అన్నారు. ఆశీర్వాదించి గెలిపిస్తే మండలంతో పాటు ఆయా గ్రామాల్లో నెలకొన్నసమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని భరోస ఇచ్చారు.

ఖేలో ఇండియాలో జిల్లా క్రీడాకారుల సత్తా



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

భారత జూడో సమాఖ్య, భారత క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో కేరళలోని త్రిస్సూరులో 3వ ఖేలో ఇండియా మహిళల జూడో లీగ్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారిణులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభతో 3 పసిడి, 2 రజతాలు, ఒక కాంస్య పతకాలు సాధించి తెలంగాణ జట్టును సబ్ జూనియర్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిపారు. అందులో ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన అలేఖ్య(55 కిలోల విభాగం), ఎస్ రమ్య(52 కిలోల విభాగం) పసిడి పతకాలు సాధించగా, జి.సహస్ర(45 కిలోల విభాగం) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఖేలో ఇండియాలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. పతకాల విజేతలను రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ డీడీ ధనలక్ష్మి, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, క్రీడా పాఠశాల హెచ్ఎం వజ్రమాల, కోచ్ నంగనూరి రాజు అభినందించారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన చౌహన్ ధన్‌లాల్ రైతుకు చెందిన ఆవు గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు సర్పంచ్ రాథోడ్ రవీందర్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం మేత కోసం ఆవును బయటకు వెళ్లింది. దారిలో తెగిపడిన విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిందని, దాని విలువ రూ. 35వేలు ఉంటుందని, ప్రభుత్వ పరంగా అధికారులు ఆదుకోవాలని సర్పంచ్, బాదితుడు కోరారు.

కాంగ్రెస్‌కు మండల వికలాంగుల మద్దతు

నవతెలంగాణ-జన్నారం

మండలలోని అన్ని గ్రామాల్లో ఉన్న వికలాంగులు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నామని వికలాంగుల సంక్షేమ సమితి మండల అధ్యక్షురాలు కాల్వ సుగుణ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో వికలాంగుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో వికలాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉన్న వికలాంగులు కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జును చేతి గుర్తుకు ఓటు వేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, మండల నాయకుడు ఇర్నాల గంగన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తేనే తెలంగాణ అభివృద్ధి

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణలో కాంగ్రెస్ గెలిచిన వెంటనే ఆరు గ్యారెంటీ స్కీములను తప్పకుండా అమలు చేస్తామని మందపల్లి ఎంపీటీసీ, దాముఖ మమత కరుణాకర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఏనుగు సుభాష్‌రెడ్డి అన్నారు, గురువారం మండలంలోని మందపల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థి వేడ్మ బొజ్జును గెలిపించాలని ప్రజలను కోరారు. అలాగే మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి మహమ్మద్ అజారుద్దీన్ ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు చదివి వినిపించారు. ఆరు గ్యారెంటీ స్కీములు తప్పకుండా అమలు చేస్తామని చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు.

సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేయాలి

నవతెలంగాణ-నస్పూర్

నవంబర్ 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో సింగరేణి కార్మికుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించేవారికే ఓటు వేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కస్తూరి చంద్రశేఖర్ అన్నారు. గురువారం గనులపై కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సొంతింటి కలపై కార్మికులకు పూర్తిస్థాయిలో హామీ ఇవ్వాలని, సంస్థను ఆర్థికంగా బలపరిచి సింగరేణి సంస్థ భవిష్యత్తు పెంచే పార్టీలకు ఓటు వేయాలని తెలిపారు. గతంలో చేసుకున్న ఒప్పందాలను వెంటనే జారీచేసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఓటు అనేది చాలా విలువైనదని ఎలాంటి ఇతర ప్రలోభాలకు లోను కాకుండా నీతి నిజాయితీతో ఓటు వేసి ఒక ఓటరుగా మన కర్తవ్యం నెరవేర్చాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్ సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నతి, లక్ష కార్యక్రమాలను సమీక్షించారు. ఉన్నతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బేస్ లైన్ పరీక్ష నిర్వహణ, ఫలితాలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాల సాధనకు సంబంధించి రికార్డుల్లో రాసిన వాటిని ప్రశ్నలు అడిగి సరిచూశారు. పదవ తరగతి లక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను సమీక్షించారు. ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల్లో విద్యార్థులు అభ్యసనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ ఉదయభాబు, జిల్లా సైన్స్ అధికారి కమ్యూనిటీ మొబైల్ కోఆర్డినేటర్ కటకం మధుకర్, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ అబీద్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రాథమిక ఉన్నత పాఠశాల తనిఖీ

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఖైర్‌గాంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆకాస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. విద్యార్థులను వర్క్‌బుక్‌లోని ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలుసుకొని ఉండాలని కోరారు. విద్యార్థుల్లో తపన శక్తిని పెంచడానికి రూంటురిడ్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఉండాలని, విద్యార్థులకు గ్రంథాలయానికి సంబంధించి పీరియడ్‌ను కేటాయించాలని వారు కోరారు. విద్యార్థులు చదవడానికి ఇంటికి పుస్తకాలు ఇవ్వాలని, చదువుతున్న పుస్తకాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా ప్రతి పాఠశాలలో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, పరీక్షల సహాయ కమీషనర్ ఉదయ్‌బాబు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-దండేపల్లి

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సతీమణి కొక్కిరాల సురేకతో కలిసి గ్రామాల్లో తిరుగుతూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఓటును అభ్యర్థించారు. మండలంలోని రెబనపల్లి, కొర్విచేల్మ, నర్సాపూర్ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆరు గ్యారెంటీ పథకాల కరపత్రాలను ప్రజలకు అందించారు. పార్టీ అధికారంలోకి రాగానే కచ్చితంగా ఆరు గ్యారంటీల పథకాలు అమలు చేసి తీరుతామని అన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల హామీలను నెరవేర్చకుండానే మళ్లీ ఎన్నికలకు వచ్చిందని ప్రజలు బిఆర్ఎస్ పార్టీని నమ్మవద్దని తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలో నెట్టి వేసిందని ఆయన ఆరోపించారు. తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తాను అధికారంలో లేకుండా గత పది సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు దగ్గరయ్యామని రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలి

- రాజకీయంగా ఎదుర్కోలేకే ఐటీ, ఈడీ దాడులు
- ఓటమి భయంతో సుమన్ కుట్రలు
- ఎన్నికల ప్రచారంలో వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-భీమారం

కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేక బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటైనాయని మాజీ ఎంపీ, చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వివేక్ వెంకస్వామి విమర్శించారు. గురువారం మండల వ్యాప్తంగా చేపట్టిన ప్రచారంలో గ్రామ ప్రజలు ఆయనకు బ్రమ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఓటమి భయంతో అటు కేసీఆర్, కేటీఆర్‌తో పాటు బాల్క సుమన్ కూడా మతి భ్రమించి ఇష్టాను సారంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలే ఎలాగైనా కాంగ్రెస్‌ను ఓడించాలని బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కాంగ్రెస్ అభ్యర్థులపై ఐటీ, ఈడీ అధికారులను దింపి దాడులు జరిపిస్తున్నాయని విమర్శించారు. తమను ప్రజలకు దగ్గర కానివ్వకుండా 3 రోజులు 8 చోట్ల దాడులు జరిపి తనిఖీలు చేశారని, చెన్నూర్‌లో బాల్క సుమన్ ఓడిపోతున్నాడని గ్రహించిన అధిష్టానం అమిత్‌షాకు ఫోన్ చేసి ఇలాంటి కుట్రలకు తెలరలేపారని ఆరోపించారు. కేసీఆర్, బీజేపీ అమిత్‌షాతో కలసి తప్పుడు ఆరోపణలతో అరెస్ట్ చేసేందుకు కుట్ర చేస్తున్నారని, తమ లావాదేవులన్నీ పూర్త లీగల్‌గా ఉన్నాయని, ఇలాంటి నీచ రాజకీయాలతో ప్రజలను ఇంకెంతో కాలం మభ్యపెట్టలేరని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్, బీజేపీ పాలనలో విసుగెత్తిపోయారని, ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మేపరిస్థితుల్లో లేరన్నారు. సుమన్‌ను చెన్నూర్ ప్రజలు ఇంటికి పంపించాలని కంకనబద్ధులైనారని గుర్తు చేశారు. రాష్ట్రంలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమని, ఇంతకాలం అభివృద్ధి పేరుతో తెలంగాణ ప్రజానికాన్ని మోసం చేసి లక్షల కోట్లు దండుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ లక్ష్యం ఒక్కటేనని, ఇంతకాలం బీఆర్ఎస్ పాలనలో దోచిన అవినీతి సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్



నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి కార్మికులు చేతి గుర్తుకు ఓటు వేసి బెల్లంపల్లి కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని బెల్లంపెల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ కోరారు. గురువారం కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని అయన మాట్లాడారు. గతంలో కార్మిక మంత్రిగా వున్నపుడు కార్మికులకు హక్కులు సాధించి పెట్టానని మళ్ళీ అవకాశం ఇస్తే కార్మిక హక్కుల కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీత రామయ్య, సీపీఐ మండల కార్యదర్శి, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు సిద్ధంశెట్టి రాజమౌళి, కంపెల్లి సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు కారుకూరి రామచందర్, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, సర్పంచి వేముల కృష్ణ, రత్నం ప్రదీప్, సిద్ధం తిరుపతి, ఏఐటీయూసీ నాయకులు పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, బొద్దుల వెంకటేష్, కొత్తపెల్లి నరసయ్య, సుభాష్ చంద్రబోస్, లింగమూర్తి, రాజ్ కొమురయ్య, నర్సిరెడ్డి, రత్నం రాయలింగు, నవీన్, బాపు, కారుకూరి తిరుపతి పాల్గొన్నారు.